కష్టపడ్డాం.. కూలి ఇవ్వరేం?

- 'ఉపాధి' కూలి అందక ఇక్కట్లు
- 12 వారాలుగా అందని వేతనాలు
- నియోజకవర్గంలో రూ.27.67 కోట్ల బకాయి
- లక్ష మందికి పైగా కూలీలు

చీకట్లోనే లేచి బువ్వ వండుకొని.. పిల్లలకు కూడా పెట్టకుండా పని సేసినాం.. 12 వారాలు గడిసినా దుడ్లు ఇవ్వలేదు. పనిచేస్తేనే మాకు కడుపు నిండుతాది.. అట్లాగాకుండా.. ఇన్నాళ్లు కూలి పైసలివ్వకపోతే ఏం తినాలి.. పిల్లలతో ఎట్ల బతకల్లా.. ఉపాధి హామీ పథకం పనులు చేసిన మహిళా కూలీ ఆవేదన ఇది. నియోజకవర్గంలో 12 వారాల పాటు పనులు చేసిన 1,00,803 కూలీలకు దాదాపు రూ.27.67 కోట్లు చెల్లించాల్సి ఉంది.


అరికెర గ్రామ సమీపంలో ఉపాధి పని చేస్తున్న కూలీలు

మండలాల వారీగా వేతన బకాయిల వివరాలు

మండలం	జాబ్ కార్డులు	కూలీల సంఖ్య	బకాయిలు రూ.కోట్లలో
ఆలూరు	10,786	15,444	3.9
ఆస్పరి	13,953	21,552	5.94
చిప్పగిరి	7,203	10,971	3.27
హాలహర్వి	10,180	15,788	4.35
హొళగుంద	10,715	15,974	4.40
దేవనకొండ	15,368	21,074	5.81
మొత్తం	67,845	1,00,803	27.67 కోట్లు

ఆలూరు రూరల్: నియోజకవర్గంలోని పేదలకు వ్యవసాయం తర్వాత అండగా ఉంటోంది ఉపాధి హామీ పథకం పనులే. అయితే..రెండు నెలలకు పైగా ఉపాధి కూలి ఖాతాల్లో జమవ్వకపోవడంతో కూలీనాలి చేసుకుని జీవనం సాగించే కుటుంబాలు తల్లడిల్లుతున్నాయి. ఓ పక్క బకాయిలు అందక, మరో పక్క సరైన పనులు లేక ఇబ్బంది పడుతున్నారు.నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 67,845 జాబ్ కార్డులు ఉన్నాయి. 55,184 కుటుంబాలు ఉపాధి పథకం పనులు చేస్తున్నాయి. 1,00,803 మంది ఉపాధి పనులకు వెళ్తున్నారు. పనికి వెళ్లిన కూలీలకు రోజుకు రూ.295 చొప్పున 12 వారాల నగదు అందాల్సి ఉంది. వారిలో కొన్ని శ్రమ శక్తి సంఘాల ఉపాధి కూలీలకు పైసా కూడా రాలేదు.

నియోజకవర్గంలో రూ.27.67 కోట్ల బకాయిలు..

వేతనాల కోసం ఎదురు చూస్తున్న కూలీలంతా చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలే. ప్రస్తుత ఖరీఫ్ సమయంలో పంటల సాగుకు పెట్టుబడికి డబ్బులు లేక సతమతమవుతున్నారు. ఇప్పటికే అందాల్సిన పెట్టుబడి భరోసా నగదు ప్రభుత్వం చెల్లించలేదు. మరికొందరు కడుపేదులు.. రెక్కాడితే కానీ డొక్కాడని జీవితాలు. మండుటెండలో కష్టపడి పని చేసినా.. నేటికీ బిల్లులు రాకపోవడంతో కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో పనిచేసిన కూలీలకు 12 వారాల నగదు రూ.27.67 కోట్లు బకాయిలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో ఒకటి రెండు వారాలు ఆలస్యమైనా మూడో వారంలో నగదు వచ్చేది. ఇప్పుడు వేతనాల కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు. ప్రభుత్వం ఉపాధి కూలీల బిల్లులు వెంటనే చెల్లించాలని కూలీలు కోరుతున్నారు.

రెండు నెలలుగా అందలేదు



కూలీకి వెళ్తేగాని గడవని కుటుంబం మాది. మే నెల తర్వాత చేసిన పనికి వేతనాలు బ్యాంకు ఖాతాలో జమ కాలేదు. ఉపాధి సిబ్బందిని అడిగితే వస్తాయని చెబుతున్నారు. కూలి రాకపోవడంతో పూట గడవడం కష్టమైంది. అలాగే పంటల సాగుకు పెట్టుబడిగా పైసా చేతిలో లేదు. ఆ సొమ్ము వస్తే మేలవుతుంది. ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. – **పింజారి రఫీ, హత్తిబెళగల్ గ్రామం**

కుటుంబం గడవడం గగనమైంది



12 వారాలుగా ఉపాధి కూలి జమ కాలేదు. నెల రోజులుగా వర్షాలు లేకపోవడంతో పొలం పనులు కూడా లేవు. ఉపాధి పనికి వెళ్తే రోజైనా గడుస్తుందని రోజూ పనికి వెళ్తున్నాం. చేసిన పనికి డబ్బులు రావడం లేదు. పనిచేస్తేనే మాకు పూట గడుస్తుంది. ఇన్ని వారాల పాటు కూలి ఇవ్వకపోతే కుటుంబం ఎలా గడుస్తుంది. – **గోవిందప్ప, అరికెర గ్రామ ఉపాధి కూలీ,**

క్లుప్తంగా

మద్దికెర చేరుకున్న కృష్ణాజలాలు


హంద్రీనీవా కాలువలో నీటి ప్రవాహం

మద్దికెర: మండల కేంద్రమైన బురుజుల, పెరవలి, హంప, ఎడవలి, మద్దికెర గ్రామాల సరిహద్దుల్లో ఉన్న హంద్రీ నీవా కాలువకు మంగళవారం కృష్ణా జలాలు చేరుకున్నాయి. కాలువకు నీళ్లు రావడంతో రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది సరైన వర్షాలు లేకపోవడంతో ఆందోళనగా ఉన్న అన్నదాతలు కాలువకు నీళ్లు వదలడంతో కాస్త ఊరట చెందుతున్నారు. మధ్యాహ్నానికి కాలువలో నీరు అనంతపురం జిల్లా కసాపురం పుణ్యక్షేత్రం పరిసరాలల్లోకి ప్రవేశించాయి.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్ అంధకారం


మాదక ద్రవ్యాల అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వర్

ఆలూరు రూరల్: మాదక ద్రవ్యాల వాడకంతో భవిష్యత్ అంధకారమవుతుందని ఆలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వర్ తెలిపారు. మంగళవారం స్థానిక కళాశాలలో యాంటీ డ్రగ్స్, టొబాకో సెల్ కో–ఆర్డినేటర్ డా.బి రాఘవేంద్ర ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..సరదా కోసం మాదక ద్రవ్యాలు తీసుకుంటే నష్టం తప్పదని, విద్యార్థి దశలో క్రమ శిక్షణతో విద్యనభ్యసించాలన్నారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ మాధవి, అధ్యాపకులు సుశీల, లక్ష్మీనరసమ్మ, ముద్దప్ప, రికార్డ్ అసిస్టెంట్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మేత కటింగ్ మిషన్ విరాళం


మేత కటింగ్ మిషన్‌ను అందజేస్తున్న దాతలు

మద్దికెర: స్థానిక సుబ్రహ్మణ్య స్వామి దేవాలయం ఆధ్వర్యంలోని గోశాలకు రూ.25 వేలు విలువ చేసే మేత కటింగ్ మిషన్‌ను స్థానికులు కాశీవిశ్వనాథ్ శెట్టి, సుదర్శన్ శెట్టి, శ్రీనివాసుల శెట్టి, మధుసూదన్ శెట్టి, ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన రఘు కలిసి అందజేశారు. గోశాల నిర్వాహకుడు విజయ్‌కు మంగళవారం యంత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దాతలకు స్వామి వారి జ్ఞాపికలు అందజేశారు. గోవులు హిందూ సాంప్రదాయానికి ప్రతీకలన్నారు. వాటి సంరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని కోరారు.

అలరించిన అష్టావధానం


అష్టావధాని ఆముదాల మురళిని సన్మానిస్తున్న దృశ్యం

దేవనకొండ: మండల కేంద్రంలోని ఎఫ్ఆర్ హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించిన అష్టావధానం విద్యార్థులను, వీక్షకులను అలరించింది. కార్యక్రమానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.వేణుగోపాల్ అధ్యక్షత వహించారు. అష్టావధాని ఆముదాల మురళి విద్యార్థులను రంజింపజేశారు. అవధానంలో సవాప్పగారి ఈరన్న, నల్లారెడ్డి, రమణామూర్తి, వెంకటేశ్వర యాదవ్, ఎస్.వి.ప్రసాద్, గోకినేని పరంధామయ్య, సుధాకర్, భాస్కర్ పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడి ఎన్నిక


వీరేంద్ర

మద్దికెర: స్థానిక నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా వీరేంద్రను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఎర్రిస్వామి, ఉపాధ్యక్షుడిగా ఓబులేసు, గౌరవ అధ్యక్షుడిగా రామాంజనేయులు, నాగభూషణంను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వీరేంద్ర మాట్లాడుతూ.. నాయీ బ్రాహ్మణుల సమస్యలను జిల్లా నాయకుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అలాగే స్థానిక లక్ష్మీనరసింహ ఆలయ కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా సత్యన్న, రామకృష్ణ, తిమ్మయ్యతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు.

వయనాడ్ బాధితులకు అండగా నిలుద్దాం

మద్దికెర: కేరళ రాష్ట్రంలోని వయనాడ్ ప్రాంతంలో జల ప్రళయం, కొండ చరియలు విరిగిపడి సర్వం కోల్పోయిన బాధితులకు అండగా నిలుద్దామని ఆపద్బాంధవ సేవాసమితి అధ్యక్ష, కార్యదర్శులు చౌక్కాసునీల్, రవికుమార్ మంగళవారం పిలుపునిచ్చారు. నేటి నుంచి 11వతేదీ వరకు విరాళాలు సేకరించనున్నట్లు చెప్పారు. ప్రజలు సహృదయంతో విరాళాలు ఇచ్చి కేరళ బాధితులను ఆదుకోవాలని కోరారు.

కమ్మరచేడులో ఉచిత కంటి పరీక్షలు

ఆలూరు రూరల్: మండలంలోని కమ్మరచేడులో గ్రామ విశ్వ హిందూ పరిషత్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఎల్‌వీ ఆస్పత్రి వైద్యులు వృద్ధులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. గ్రామానికి చెందిన వంద మందికి కంటి పరీక్షలు చేయగా ఇందులో 25 మందికి కంటి ఆపరేషన్ కోసం రెఫర్ చేశారు. బుధవారం ప్రత్యేక వాహనంలో వీరిని కర్నూలు ఎల్‌వీ కంటి ఆస్పత్రికి తీసుకెళ్లి శస్త్ర చికిత్స చేయించనున్నారు. బసవరాజు, బాలకృష్ణ, మల్లికార్జున రెడ్డి ఉన్నారు.

ఎస్సీ హాస్టల్‌ను పునః ప్రారంభించాలి

హొళగుంద: మండల కేంద్రం హొళగుందలోని ఎస్సీ బాలుర వసతి కేంద్రాన్ని పునః ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి సతీష్‌కుమార్, నాయకులు నాగరాజు, శ్యాముల్, రాజ్, అజయ్ తదితరులు మంగళవారం హొళగుందకు వచ్చిన ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రూ.88 లక్షలతో హొళగుందలో నిర్మించిన ఎస్సీ హాస్టల్‌ను ఆరేళ్ల క్రితం మూసి వేశారని, దీనివల్ల చాలా మంది విద్యార్థులు విద్యకు దూరమై తల్లిదండ్రులతో కలిసి వలసలు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం పరిశీలన


పొలాల్లో పరిశీలిస్తున్న డాగ్ స్క్వాడ్

ఆస్పరి: మండల కేంద్రమైన ఆస్పరికి చెందిన కావలి చిన్న నరసన్న (52) తన పొలంలో అనుమానస్పదంగా మృతి చెందడాన్ని సోమవారం గుర్తించారు. దీనిపై ఆస్పరి సీఐ హనుమంతప్ప డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు మంగళవారం కర్నూలు నుంచి వచ్చిన డాగ్ స్క్వాడ్‌తో ఏఎస్ఐ పురుషోత్తం పొలం పరిసరాలను పరిశీలించారు. క్లూస్‌టీం ఇన్‌చార్జ్ షేక్ అన్వర్ పొలంలో మట్టి నమూనాలను సేకరించారు. నమూనాలను ల్యాబ్‌లో పరీక్షించేందుకు తీసుకెళ్లినట్లు సీఐ తెలిపారు.

ప్రొటోకాల్ విషయంలో రాజీపడేది లేదు

- మండల మీట్‌లో ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి
- ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచన


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి

హొళగుంద: ఏ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులైనా వారి ప్రొటోకాల్ విషయంలో అధికారులు పక్షపాతం చూపితే సహించేది లేదని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ తంబాకు నూర్జహాన్‌బీ అధ్యక్షత జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలపై వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులకు సరైన సమాచారం ఇవ్వకపోవడం, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విద్య, ఇతర శాఖాధికారుల తీరుపై గజ్జహళ్లి, ఇంగళదహాళ్ తదితర గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మల్లికార్జున, కెంచప్ప, కొత్తింటి వెంకటరెడ్డి, వెంకట్రామిరెడ్డి, నాగిరెడ్డి, విరూపాక్షరెడ్డి తదితరులు సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ ఇది మంచి పద్ధతి కాదని మరోసారి ఇలా జరిగితే బాగుండదని తీరు మార్చుకోవాలని సూచించారు. ఆర్‌అండ్‌బీ ఏఈ రవికాంత్ మాట్లాడుతుండగా సభ్యులు అధ్వానంగా ఉన్న ఢణాపురం–హొళగుంద రోడ్డు గురించి నిలదీశారు. కనీసం గ్రావెల్ వేసి బాగు చేయాలని కోరారు. వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను సూచించారు. ప్రధానంగా తాగునీరు, రోడ్ల సమస్య తీవ్రంగా ఉందని వాటి పై దృష్టిపెట్టాలన్నారు. ప్రజాప్రతినిధులు కూడా సమావేశంలో తమ గ్రామాలోని సమస్యలను తెలియజేసి పరిష్కరించుకోవాలని సూచించారు. ఎస్ఎస్ ట్యాంకులను పూర్తిస్థాయిలో నింపుకోవాలని గజ్జహళ్లి, సమ్మతగేరి ఎస్ఎస్ ట్యాంకుల సామర్థ్యాన్ని పెంచాలని ఇందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సభ్యులు సమావేశంలో అనేక సమస్యలపై అధికారులను నిలదీశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కురువ బుజ్జమ్మ, డీఎల్‌డీఓ నాగేశ్వర రావు, ఎంపీడీఓ ఆజాద్, వైస్ ఎంపీపీ సిందువాళ గాదెమ్మ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణకు చట్టం తేవాలి


పత్తికొండలో రాస్తారోకో చేస్తున్న న్యాయవాదులు

తుగ్గలి(పత్తికొండ): న్యాయవాదులపై దాడి చేసిన పోలీసు అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగస్వామి, ప్రధాన కార్యదర్శి మహేష్, సీనియర్ న్యాయవాదులు ఎల్లారెడ్డి, మైరాముడు, సురేంద్రకుమార్, కృష్ణయ్య, దామోదరాచారి డిమాండ్ చేశారు. దాడులకు నిరసనగా జిల్లా న్యాయవాదుల సంఘం పిలుపు మేరకు మంగళవారం పత్తికొండలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టడంతో రాకపోకలు స్తంభించాయి. వారు మాట్లాడుతూ.. ఆళ్లగడ్డ బార్ అసోసియేషన్ న్యాయవాది సుబ్బారెడ్డిపై నంద్యాల సీఐ రాజారెడ్డి అనుచితంగా ప్రవర్తించడంతో పాటు దాడికి పాల్పడ్డారన్నారు. అలాగే నందికొట్కూరు న్యాయవాది గొల్ల శశిధర్‌పై అలంపూర్ పోలీసులు దాడి చేశారన్నారు. ప్రజా సమస్యలు, కేసుల గురించి పోలీస్ స్టేషన్‌కు వెళ్లే న్యాయవాదుల పట్ల పోలీసు అధికారులు దాడులకు పాల్పడడం సమంజసం కాదన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో సమయంలో అటుగా వచ్చిన ఆర్డీఓ రామలక్ష్మి వాహనాన్ని అడ్డుకుని బైఠాయించారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రవికుమార్, కోశాధికారి రాజశేఖరనాయుడు, సహాయ కార్యదర్శి వాసుదేవ నాయుడు, న్యాయవాదులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల చోరీలు


సీసీ ఫుటేజీలో నమోదైన దుండగుడి చిత్రం

తుగ్గలి: పెండేకల్లు రైల్వే జంక్షన్‌లో వీరన్న స్వామికి చెందిన కిరాణ దుకాణంలో సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తు తెలియన వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఇద్దరు వ్యక్తులు ముఖాలకు ముసుగు వేసుకొని తాళం పగులగొట్టి దుకాణంలో చోరీ చేశారు. రూ.43 వేల నగదు, రూ.10 వేల సరుకులు చోరీ జరిగినట్లు బాధితుడు వాపోయారు. చోరీకి సంబంధించిన సీసీ ఫుటేజీ దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. ఘటనపై తుగ్గలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. అలాగే బాట తండాలో ఆంజినేయులు నాయక్, స్వామినాయక్ ఇళ్లలో చోరీ జరిగింది. సదరు వ్యక్తులు మూడు రోజుల కిందట ఇళ్లకు తాళాలు వేసి పని నిమిత్తం రాజంపేటకు వెళ్లారు. తిరిగి వచ్చి చూడగా చోరీ జరిగిందని గ్రహించారు. కొంత బంగారం, నగదు చోరీ అయినట్లు బాధితులు సోమవారం జొన్నగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం కర్నూలు నుంచి వచ్చిన డాగ్ స్క్వాడ్ బృందం ఆ పరిసర ప్రాంతాల్లో పరిశీలించింది. దుండగుల వేలిముద్రలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని జొన్నగిరి ఎస్ఐ చంద్ర తెలిపారు.

వ్యాధుల నివారణపై అవగాహన

తుగ్గలి: దోమలను నియంత్రిస్తే ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చని హెల్త్ సూపర్‌వైజర్ నాగమ్మ అన్నారు. మంగళవారం తుగ్గలిలో సీజన్‌ల వ్యాధుల నివారణకు చేపట్టాల్సిన చర్యలను ప్రజలకు వివరించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుతూ, దోమలు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమల నివారణ వాటి నుంచి వచ్చే వ్యాధులు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఏఎన్ఎం మహాలక్ష్మి, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాల వద్ద స్పీడ్ బ్రేకర్లు వేయాలి



రాస్తారోకో చేస్తున్న జెడ్పీ హెచ్ఎస్ స్కూల్ విద్యార్థులు

ఆస్పరి: స్థానిక జెడ్పీహై స్కూల్ వద్ద స్పీడ్ బ్రేకర్లు వేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు మంగళవారం రాస్తారోకో చేపట్టారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు రవి మాట్లాడుతూ ఆస్పరిలో జెడ్పీహెచ్ స్కూలు పత్తికొండ–ఆదోని రోడ్డు పక్కనే ఉండడంతో వాహనాల రద్దీ అధికంగా ఉందన్నారు. 3 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు రోడ్డు దాటే స్కూల్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. వాహనాలు అతివేగంగా వస్తుండడంతో విద్యార్థులు రోడ్డు దాటలేక భయందోళనలు చెందుతున్నారని చెప్పారు. స్కూల్ వద్ద స్పీడ్ బ్రేకర్లు వేయమని కోరినా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాలు జరగక ముందే అధికారులు స్పీడ్ బ్రేకర్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు యువరాజు, మహేంద్ర, తరుణ్, అంజి, సంతోష్ పాల్గొన్నారు.


వెల్దుర్తిలో వరుస చోరీలు

- రూ.లక్షన్నర విలువచేసే సెల్‌ఫోన్ల చోరీ
- సీసీ కెమెరాలో నమోదైన దుండగుడి దృశ్యాలు


సీసీ ఫుటేజీ నిక్షిప్తమైన దుండగుడి దృశ్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి పట్టణంలో మంగళవారం ఉదయం పలు దొంగతనాలు వెలుగుచూశాయి. రోడ్డు పక్కనున్న బంకులు, షాపులను టార్గెట్ చేసుకున్న దుండగుడు షెట్టర్ల తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడినట్లు తెలుస్తోంది. డోన్ రోడ్డులో పాత పోస్టాఫీసు పక్కనున్న బంకులో సిగరెట్లు, కొంత చిల్లర, సమీపంలోని అమీర్ రేడియం షాపులో రూ.2 వేల నగదు, ప్రభుత్వాసుపత్రి సమీపంలో చెరుకులపాడు నారాయణరెడ్డి నగర్ ఎదురుగా గల ఎస్ఎల్ఎం మొబైల్స్ షాపులో దాదాపు రూ.లక్షన్నర విలువ జేసే 11 కొత్త సెల్‌ఫోన్లు చోరీ అయినట్లు ఉదయం షాపులకు చేరుకున్న యజమానులు గుర్తించారు. ఇంకా పలు షాపుల తాళాలు పగులగొట్టే ప్రయత్నం చేసినట్లు తెలుసుకున్నారు. ఎస్ఎల్ఎం మొబైల్స్ షాపు యజమాని విభూది బాలు అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్‌కుమార్ తెలిపారు. మొబైల్ షాపులోకి చొరబడేందుకు దుండగుడు షెట్టర్ ఒకవైపు తాళం పగులగొట్టి, షట్టర్ పైకెత్తి లోపలికి దూరేందుకు వీలుగా సిమెంట్ ఇటుక, పైప్‌ను ఉపయోగించినట్లు అక్కడ పడిఉన్న వస్తువులను బట్టి తెలుస్తోంది. అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో పైప్‌ను కొంత దూరం నుంచి తెచ్చుకునే ప్రయత్నంలో ఉన్న అనుమానితుడి దృశ్యాలు మొబైల్ షాపు అవతల ఓ దుకాణం బయటివైపు ఉన్న సీసీ కెమెరాలో నిక్షిప్తమయ్యాయి. అన్ని కోణాల్లో పూర్తిస్థాయి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సీపీఐ రైతు సంఘం కమిటీ ఎన్నిక


మాట్లాడుతున్న సీపీఐ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంపన్న గౌడ్

వెల్దుర్తి(కృష్ణగిరి): పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో అనుబంధ రైతు సంఘం నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంపన్నగౌడ్, సీపీఐ మండల కార్యదర్శి టి.కృష్ణ, ఏఐటీయూసీ మండలాధ్యక్షుడు మాధవస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో నూతన కమిటీ అధ్యక్షుడిగా డి.రాజు, ఉపాధ్యక్షుడిగా విజయుడు, ప్రభుదాసు, కార్యదర్శిగా సాంబశివుడు, సహాయ కార్యదర్శులుగా దస్తగిరి, వెంకటేశ్వర్లు, మరికొందరు ప్రతినిధులుగా దస్తగిరి, వెంకటేశ్వర్లు, 11 మంది సభ్యులు ఎన్నికయ్యారు. పంపన్న గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా రైతులకిచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నూతన కమిటీ రైతు సమస్యల పోరాటానికి ముందుండాలని సూచించారు.

అమర వీరులకు నివాళి

హొళగుంద: సీపీఐ (ఎంఎల్) న్యూ డెమొక్రసి జిల్లా కార్యదర్శి మల్లికార్జున ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో కారంచేడు, చుండూరు, వేంపెంట దళిత అమర వీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో దళితులు, మైనార్టీల పై, మహిళలపై విచక్షణా రహితంగా దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హక్కులు, ఆత్మగౌరవం కోరకు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మునిస్వామి, ఎంకప్ప, శంకర్, సొరప్ప, బసప్ప, దేవన్న, వెంకటేశ్ పాల్గొన్నారు.

చిన్నారులకు తల్లిపాలే శ్రేయస్కరం


తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న డీడీఓ మహ్మద్ వాహిద్


మద్దికెరలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఆలూరు: చిన్నారులకు తల్లి పాలు శ్రేయస్కరమని ఆలూరు సీహెచ్‌సీ డీడీఓ మహ్మద్ వాహిద్ అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా మంగళవారం స్థానిక సీహెచ్‌సీ ఆవరణలో వివిధ గ్రామాలకు చెందిన బాలింతలకు, చిన్నారులకు తల్లులు పాలు పట్టే విధానంపై బొమ్మల ద్వారా అవగాహన కల్పించారు. తల్లి పాలు బిడ్డల ఆకలిని తీర్చడంతో పాటు పోషకాలు, వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్రీకాంత్ గీతా వాణి, సుయీద్, రామకృష్ణ, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టిన బిడ్డకు తల్లిపాలనే తాపించాలి

హాలహర్వి: పుట్టిన ప్రతి బిడ్డకు తల్లిపాలు తాపించాలని, ముర్రుపాలే బిడ్డకు శ్రీరామ రక్ష అని డాక్టర్లు గంగాధర, ఈరన్న తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని అర్ధగేరి పీహెచ్‌సీలో ఆశావర్కర్లతో కలిసి తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యాధికారులు మాట్లాడుతూ ఆరు నెలల వరకు బిడ్డకు తల్లిపాలే అమృతం అని చెప్పారు. 7వ నెల నుంచి అనుబంధ ఆహారం తినిపించాలని సూచించారు.

బిడ్డకు తల్లిపాలు బిడ్డకు అమృతం

మద్దికెర: పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లిపాలు పట్టించడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరిగి సంజీవనిలా పనిచేస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌభాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఆదేశాల మేరకు మద్దికెరలో అంగన్‌వాడీ కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తల్లిపాలలో ఉండే పోషక విలువలతో బిడ్డ నిండు ఆరోగ్యంతో ఉంటారన్నారు. తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు రాజేశ్వరి, కృష్ణవేణి, పద్మజ, రంగమ్మ, నాగవేణి, శశికళ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కప్పట్రాళ్లలో ప్రతిష్టోత్సవాలు


పునఃనిర్మాణం తర్వాత ఆలయం

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో పునఃనిర్మించిన శ్రీ లక్ష్మీసమేత చెన్నకేశవస్వామి ఆలయంలో బుధవారం నుంచి శుక్రవారం వరకు జీర్ణోద్ధరణ, ధ్వజస్తంభం, గ్రామనాభిశిల (బొడ్డురాయి) తదితర ప్రతిష్టాపన కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు తెలిపారు. ఈనెల 7నుంచి 9వ తేదీ వరకు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, ప్రతిష్టాపన కార్యక్రమాలు ఉంటాయన్నారు. 9న ఉదయం ప్రాతఃకాల పూజలు, తెల్లవారుజామున 1.40 నుంచి 1.50 గంటల్లోపు వృషభ లగ్నంలో యంత్రప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, ప్రాణప్రతిష్ట, దీక్షాహోమం, కళాన్యాసం, ఓక్షాగ్నిజ్వాల, బలిహరణ, పూర్ణాహుతి, మహామంగళహారతి తదితర విశేష పూజలు నిర్వహిస్తామన్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.